కూల్చివేతలు.. బతుకులు రోడ్డుపాలు

కోడి కూత సమయానికే రామగుండం బల్దియా కార్యాలయం నుంచి జేసీబీ వాహనాలు బయల్దేరాయి. చడీచప్పుడు లేకుండా గోదావరిఖని శివారులోని గంగానగర్‌కు చేరుకున్నాయి.. అక్కడ ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఏడాదిన్నర క్రితం 350మంది నిరుపేద కుటుంబాలు ఇండ్లు నిర్మించుకున్నాయి. అయితే వాటి కూల్చివేత లక్ష్యంగా బల్దియా 'ఆపరేషన్ గంగానగర్'తో రంగంలోకి దిగింది. ఓ వైపు పేదల ఆర్తనాదాలు.. మరోవైపు ఎక్స్‌కవేటర్లతో ఇండ్లను కూల్చివేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఏకంగా 140ఇండ్లు కూల్చివేయడంలో నిరుపేదలు రోడ్డునపడ్డారు. ఇదంతా ప్రభుత్వ స్థలమని.. ఇక్కడ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మాణం కోసం ప్రస్తుతం దాదాపు 140ఇండ్లను మాత్రమే తొలగించినట్లు అధికారులు తెలిపారు. అప్పటి దాకా పేదలకు అండగా ఉన్న ఎర్ర జెండా పార్టీ నాయకులు సైతం ప్రేక్షక పాత్ర వహించడం పలు అనుమానాలకు దారితీసింది.

గంగానగర్ లో జేసీబీతో ఇండ్లను కూల్చివేస్తున్న సిబ్బంది

- ఖనిలో 'ఆపరేషన్ గంగానగర్'
- వేకువజామునే 140ఇండ్ల కూల్చివేత
- ఎస్‌టీపీ నిర్మాణం పేరిట బల్దియా కొరడా
- ఏడాదిన్నర క్రితమే ఇండ్లు నిర్మించుకున్న పేదలు
- ప్రేక్షక పాత్ర వహించిన ఎర్రజెండా పార్టీ నాయకులు

కోల్‌సిటీ, ఆగస్టు 13 : రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని గోదావరిఖని 8వ డివిజన్ శివారు గంగానగర్‌లో సర్వే నంబర్ 36, 37, 38లో దాదాపు పదెకరాల్లో గతేడాది దాదాపు 350మంది నిరుపేద కుటుంబాలు ఇండ్లు నిర్మించుకున్నాయి. మంగళవారం తెల్లవారుజామున రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది దాదాపు 140ఇండ్లను కూల్చివేతకు ఒడిగట్టారు. దీంతో బాధితులంతా లబోదిబోమంటూ బయటకు పరుగులు పెట్టారు. ఇది ప్రభుత్వ స్థలమని.. ఇక్కడ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించిందని, ఇక్కడ నుంచి ఖాళీ చేయాలంటూ హుకూం జారీ చేశారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో దాదాపు 140 ఇండ్లను కూల్చివేశారు. ఓ వైపు బాధితుల ఆర్తనాదాలు.. మరోవైపు కూల్చివేతలతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించడంతో కూల్చివేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. పదెకరాల్లో సుమారు 350వరకు ఇండ్లు నిర్మించుకున్నారని, అయితే ఎస్‌టీపీ కోసం కేటాయించిన స్థలంలో నిర్మించిన ఇండ్లను మాత్రమే తొలగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఒక రోజు ముందే మంతనాలు

ఆపరేషన్ గంగానగర్‌కు ఒకరోజు ముందుగానే పోలీస్ అధికారులు, సీపీఎం నాయకులతో ఓ వర్గం ప్రజాప్రతినిధులు సమావేశమై మంతనాలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. గంగానగర్ శివారులో ఉన్న 350 నిరుపేదల ఇండ్లను ఎస్‌టీపీ నిర్మాణం పేరుతో కూల్చివేయడానికి చర్యలు తీసుకున్నామని, అర్ధరాత్రి నుంచే కూల్చివేతల పర్వం సాగుతుందని, అందుకు అడ్డు చెప్పకుండా ఉండాలంటూ బాధితుల పక్షాన నిలబడిన ఓ పార్టీ నాయకులతో మంతనాలు చేసినట్లు సమాచారం. దీంతో మంగళవారం ఉదయం అంతా అనుకున్నట్టుగానే నిర్మాణాల కూల్చివేతలు అడ్డంకులు లేకుండానే సాగినట్లు తెలుస్తోంది.

బాధితులకు దిక్కెవరు? ముంచిందెవరు?

ఈ ఆపరేషన్‌లో సమిధులైన బాధితులకు ఇప్పుడు దిక్కెవరు... వారిని నిండా ముంచిందెవరు..? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం బాధితులంతా కన్నీటిపర్యంతమవుతూ తమ గోడువెల్లబోసుకున్నారు.అనుమతులు, పట్టాల కోసం ఓ పార్టీకి చెందిన మహిళా నాయకురాలు ఒక్కో ఇంటి నుంచి దాదాపు రూ.20వేల నుంచి రూ.30వేల దాకా వసూలు చేశారని, ఇప్పుడు అధికారులు వచ్చి కూలగొడుతుంటే తమనే బుజ్జగిస్తున్నారే ధ్వజమెత్తారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో బుజ్జగింపులు

కూల్చివేత ప్రారంభించగానే బాధితులు అడ్డుచెప్పారు. ఇండ్లు కూల్చివేతకు సహకరించి ఖాళీ చేస్తే.. పక్కనే ఉన్న స్థలంలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం తరపున రూ.5లక్షల సాయంతోపాటు స్థానిక ఎమ్మెల్యే కోటా నుంచి కూడా సాయం అందతుందని ఓ వర్గం నాయకులు బాధితులను బుజ్జగించినట్లు తెలుస్తోంది. దీంతో అమాయకులైన బాధితులు ఆర్తనాదాలతో నిస్సహాయ స్థితిలో కనిపించారు. ఇండ్లు కోల్పోయిన వారికి సమీపంలో త్వరలోనే ఇండ్ల స్థలాలు ఇస్తారా? అది సాధ్యమయ్యే పనేనా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

పేదల ఇండ్లు కూల్చడం బాధాకరం: సీపీఎం

గంగానగర్‌లో ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న 140మంది ఇండ్లు కూల్చడం బాధాకరమని సీపీఎం నాయకుడు వై యాకయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఘటనా స్థలంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్‌టీపీ నిర్మాణం కోసం ఈ స్థలానికి ఎంపిక చేశారని, ఆ ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన స్థలంలో ఉన్న 140 ఇండ్లను తొలగిస్తున్నారన్నారు. బాధితుల పక్షాన స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడామని, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో బాధితులందరికి ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించారన్నారు. బాధితులకు న్యాయం జరిగే దాకా అండగా ఉంటామన్నారు.

నాడు ఓట్లేత్తే పట్టాలు ఇస్తమన్నరు

నాడు కాంగ్రెస్‌కు ఓట్లేత్తే ఇక్కడే పట్టాలు ఇత్తమన్నరు. ఇప్పుడేమో ఉన్నపలంగా ఖాళీ చేయమని కూలగొడుతున్నరు. నాకు నలుగురు పిల్లలున్నరు. వంద గజాల స్థలం ఇత్తే రూ.లక్షా 20వేల అప్పు తెచ్చి ఇల్లు కట్టుకున్న. ఇప్పుడు మొత్తం కూలగొట్టిన్రు. మధ్యమధ్యల వాళ్లు వీళ్లు అత్తే ఇప్పటికి రూ.5వేలు చేతిలో పెట్టినం. ఐన పాపం అనకుండా కూలగొట్టిన్రు. అడిగితే ఇంకెక్కడో ఇత్తమంటున్రు. ఎమ్మెల్యే సారు మాకు న్యాయం జెయ్యాలని చేతులెత్తి దండం పెడుతున్న.

- గజ్జెల ప్రమీల, బాధితురాలు

ఇంత అన్యాయం ఉంటదా..

ఇంత అన్యాయం ఉంటదా. ఆడబిడ్డ అని గూడ జూడకుండ బయటకు నెట్టి ఇల్లు కూలగొడ్తున్రు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఇల్లు, జాగలేకుంటే ఇక్కడ షెడ్డు వేసుకున్నం. ఇప్పుడు నాకు దిక్కెవరు.. మేము ఎక్కడికెళ్లి ఉండాలె. ఇంకెక్కడో జాగ ఇత్తమని జెప్పి కూలగొడ్తున్రు. మాకు న్యాయం చేయండి.

- ఆచమల్ల తిరుమల, బాధితురాలు

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

గోదావరిఖని, ఆగస్టు 13: స్వతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని తొమ్మిది మందిని ఉత్తమ ఉద్యోగులుగా యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఆర్జీ-1 అధికార ప్రతినిధి ఉద్యోగుల పేర్లను వెల్లడించారు. చిందం కొమురయ్య (సపోర్ట్ మెంట్) ఎడ్ల సుధాకర్ (కోల్‌కట్టర్) సాగర్ల రాజయ్య (ఎస్‌డీఎల్ ఆపరేటర్), బొల్లెం శ్రీనివాస్ (కోల్‌కట్టర్), జీటీ వెంకటేశ్వర్లు ఈపీ ఆపరేటర్(జీడీకే సీఎం, 2, 2ఏ,5), ఓసీ, కొంపల్లి లక్ష్మణ్ (ఎలక్ట్రీషియన్, కొట్టే సుధాకర్ (షటిల్‌కార్ ఆపరేటర్), మాటూరి రాజేశం (జనరల్ మజ్దూర్), జానీమియా (హెల్పర్)గా పేర్కొన్నారు. వీరిని స్వాతంత్ర వేడుకల్లో ఆర్జీ-1 జీఎం సన్మానించనున్నారు.

ఆర్జీ-2 నుంచి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13 : ఆర్జీ-2 ఏరియా ఉత్తమ ఉద్యోగులను జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ వెల్లడించారు. ఐదుగురు ఉత్తమ ఉద్యోగులను ప్రకటించారు. వీరిని 78వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆర్జీ-2 ఏరియాలో సన్మానించనున్నారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైనా వారిలో ఓసీపీ-3 ఉద్యోగులు ఫిట్టర్ అయిరెడ్డి సంపత్ రెడ్డి, మెకానిక్ ఫోర్‌మెన్ జల్లి వెంకటేష్, కన్వేయర్ ఆపరేటర్ సంకే రాజయ్య, వకీలుపల్లి ఉద్యోగులు సెటిల్ కార్ ఆపరేటర్ కూచిపూడి రాంబాబు, టెండాల్ సూపర్‌వైజర్ మెడగొని బుచ్చిరాజం ఎంపిక చేసినట్లు తెలిపారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

పెద్దపల్లి, ఆగస్టు13: జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ నియంత్రణకు చేపట్టిన చర్యలపై కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల రవాణా, గంజాయి సాగు, వినియోగ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య, ఏసీపీ కృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ కే ప్రమోద్ కుమార్, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ పీ శ్రావణ్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, డీఈవో డీ మాధవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆదిరెడ్డి, జిల్లా రవాణా అధికారి రంగారావు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, వ్యవసాయ శాఖ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాశ్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

అంతర్గాం, ఆగస్టు 13: భూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. అంతర్గాం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి సమస్యలు, భూసేకరణ, వివిధ సర్టిఫికెట్ల జారీ అంశాలపై సమీక్షించారు. . సమావేశంలో తహసీల్దార్ రమేశ్, ఇతర అధికారులు ఉన్నారు.

దేవాలయ భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్న గ్రామస్తులు

ముత్తారం, ఆగస్టు 13: ఓడెడ్ గ్రామంలో శ్రీ మల్లన్న దేవాలయానికి కేటాయించిన భూమిని అదే గ్రామానికి చెందిన పల్లెర్ల రమేశ్ గౌడ్ మంగళవారం చదును చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో మల్లన్న దేవాలయం నిర్మాణం కోసం గతంలో ఆ భూమిని ఇవ్వగా ఆలయానికి నిర్మించారు. ఆలయం నిర్మించగా మిగిలిన భూమిలో రమేశ్ గౌడ్ వ్యవసాయ సాగు పనులను భూ మిని చదును చేస్తుండగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. దీంతో రమేశ్ గౌడ్, గ్రామస్తుల మధ్యలో వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామస్తుల వాగ్వాదంతో వెనక్కి తగ్గిన రమేశ్ గౌడ్ చదును చేసే పనులను విరమించుకున్నారు.

ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు

పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్, ఆగస్టు 13: అంగన్ వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా ఆధునీకరించినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ పని తీరుపై అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల పని తీరు,అందుతున్న సేవలు, లబ్ధిదారుల వివరాలు, పూర్వ విద్యా కేంద్రాల ఏర్పాటు కోసం అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన శిక్షణ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్ల ల ఎదుగుదలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల న్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ విద్యా కేం ద్రాలుగా(ప్రీ స్కూల్)గా ప్రభుత్వం తీర్చిదిద్దింద న్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ప్రీస్కూల్ పాఠ్యాంశాలు సిలబస్ బోధించాలన్నారు. గర్భిణులకు రెగ్యులర్‌గా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తీసుకుంటున్నారా.. లేదా అనే అంశాన్ని సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. అనంతరం భేటీ బచావో.. భేటీ పడావోకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్, సీడీపీవో కవిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

పెద్దబొంకూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిగా ఆధునీకరించాలన్నారు. ఇందుకోసం పెద్దబొంకూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్ రూరల్, ఆగస్టు 13: సీజనల్ వ్యా ధుల వ్యాప్తిని అరికట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇసుక రీచ్, తహసీల్ కార్యాలయం, నీరుకుళ్ల, గట్టెపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. గట్టెపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిచారు. నీరుకుళ్ల, గట్టెపల్లిలో ఏర్పాటు చేయబోయే ఇసుక రీచ్‌లను తనీఖీ చేశారు. ఇసుక రీచ్‌లకు అవసరమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. 8వ వార్డులోని మున్సిపల్ నీరు సరఫరా అయ్యే బావిని పరిశీలించారు.

ఉదారతను చాటిన 'గృహం హెల్పింగ్ హ్యాండ్స్' ఫౌండేషన్

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పెద్దపల్లి, ఆగస్టు13: సుల్తానాబాద్ మండలం మియాపూర్‌కు చెంది న దొడ్ల గంగాధర్ ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఈ క్రమం లో మంగళవారం పెద్దపల్లిలోని గృహం అభ్యాస్ స్కూల్‌లో గృహం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి శ్రావణ్ కుమార్, లయ న్స్ క్లబ్ ఆఫ్ పెద్దపెల్లి ఎలైట్ సమక్షంలో రూ.10లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించి ఉదారతను చాటుకున్నారు. ఈ సంద ర్భంగా ఫౌండేషన్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ లయన్స్ క్లబ్ సభ్యులు బండ బాబురావు, ఊట్ల అశోక్ కుమార్, సంపత్ రావు, సుష్మ, కంకటి శ్రీనివాస్, పెద్దపల్లి శ్రావణ్ కుమార్, పెద్దపల్లి రాజేశం, అతీఫ్, కోశాధికారి వినోద్, చొప్పరి వంశీ ఉన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నేతలు

బీసీ సదస్సును విజయవంతం చేయండి

పెద్దపల్లి, ఆగస్టు 13: బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20న పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో నిర్వహించే బీసీ సదస్సును విజయవంతం చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంబీ గార్డెన్‌లో బీసీ నాయకులతో కలిసి బీసీ సదస్సుకు సంబంధించిన కరప్రతాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో రిజర్వేషన్ దక్కేలా బీసీలు ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కౌశిక హరి, గంట రాములు, సంపత్ యాదవ్, రఘువీర్ సింగ్, ఉప్పు రాజ్‌కుమార్, దాసరి ఉష, మారం తిరుపతియాదవ్, ఆకుల స్వామి, వివేక్ పటేల్, చిలారపు పర్వతాలుయాదవ్, ఎన్ శంకర్, లైశెట్టి భిక్షపతి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HEALTH CARE TO-LET EDUCATION

వాంటెడ్ రిసెప్షనిస్ట్

jobs Apply Now!

★వాంటెడ్ రిసెప్షనిస్ట్ (స్త్రీలు) బడ్జెట్ హోటల్ కరీంనగర్ నందు అనుభవం ఉన్నవారు/ క్రొత్తవారు కావలెను. సంప్రదించండి: సెల్: 8374306406/8500607494

NTK-00000

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.

NT- 326217

CHANGE OF NAME

★Nadigotla Lavanya, W/o. Rajanikanth, H.No. 4-82, Rudravaram, Vemulawada Mandal, Rajanna Sircilla Dist, my Name was changed as Lingampalli Padma W/o. Rajanikanth.

NTK-0000

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్జీ-1లో గ్రీవెన్స్‌డే

గోదావరిఖని, ఆగస్టు 13: సింగరేణి ఆర్జీ-1 పరిధిలో 1,2,3 గనులు, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారం కోసం సంస్థ చేపట్టిన గ్రీవెన్స్‌డే మంగళవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయంలోని సమావేశం హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి సింగరేణి డైరెక్టర్(పా అండ్ ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్ ఉద్యోగుల అర్జీలు స్వీకరించారు. ఇక్కడ ఆర్జీ-1 జీఎం, నోడల్ ఆఫీసర్ డీ లలిత్‌కుమార్, ఆర్జీ-1 జీఎం ఎల్‌వీ సూర్య నారాయణ, ఆర్జీ-1 జీఎం సుధాకర్‌రావు, అడ్రియాల జీఎం వెంకటేశ్వర్లు, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీనయ్ పీఏ శ్రావణ్‌కుమార్, ఆంజనేయులు, కిరణ్ రాజ్‌కుమార్, అధికారులు ఉన్నారు.

అవగాహన కల్పించాలి

పెద్దపల్లి, ఆగస్టు13: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో కే ప్రమోద్ కుమార్ ఆశ కార్యకర్తలకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నిషేధం, డెంగ్యూ నివారణలో ఆశ కార్యకర్తల పాత్ర అనే అంశాలపై ఆశ నోడల్ సూపర్‌వేజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్పొరేటర్ భర్తకు పోలీసు నోటీస్

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 13: నగరంలోని 25వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ భర్త నగునూరి రాజుకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నోటీసును అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. ఓదెల జితేందర్ బిల్డింగ్ నిర్మిస్తుండగా నగునూరి రాజు అతడిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజుపై వన్‌టౌన్‌లో కేసు నమోద్దైంది. దీంతో రాజు ఇంట్లో లేకుండా తప్పించుకుంటూ తిరుగుతుండగా మంగళవారం వన్‌టౌన్ ఎస్ఐ భూమేష్ ఇద్దరు పంచుల సమక్షంలో వారి ఇంటికి బీఎన్ఎస్ఎస్ ప్రకారం మూడు రోజుల్లో ఠాణాకు రావాలని ఇంటికి నోటీస్ అతికించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జయ్యారం పాఠశాలలో వైద్యశిబిరం

పాలకుర్తి, ఆగష్టు13: జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాంఘికసంక్షేమ హాస్టల్‌లోని మంగళవారం పుట్నూర్ ఆరోగ్యకేంద్రం సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. దద్దుర్లు, జ్వరాలు, దగ్గు, జలుబు ఎక్కువగా ఉండటంతో పుట్నూర్ డాక్టర్ సాయిసూర్య విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీచేశారు. హెచ్ఎం పురుషోత్తం, కార్యదర్శి సాయిచరణ్‌రెడ్డి, హాస్టల్‌వార్డెన్ సంపత్‌కుమార్, ఏఎన్ఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 13: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గోదావరిఖనిలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో మాజీ సైనికుల చేతుల మీదుగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఇక్కడ మాజీ సైనికుల సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఎస్ గంగరాజు, ఈ శ్రీనివాస్, ఎన్ శంకర్, బీపోచన్న, రాధాకృష్ణ, మొగిళి, హై హరినాథ్‌రెడ్డి, బీ మహేందర్ ఉన్నారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

పెద్దపల్లి కమాన్, ఆగస్టు 13 : విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకొని సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను తయారు చేయాలని డీఈవో మాధవి అన్నారు. పెద్దపల్లిలోని అమర్‌చంద్ కల్యాణమండపంలో మంగళవారం నేషనల్ గ్రీన్ కోర్ ప్రాజెక్టు (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ హిత ట్యూబ్ లైట్ల తయారీపై శిక్షణ ఇచ్చారు. దీనికి జిల్లాలోని 52 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 160 మంది విద్యార్థులు హాజరై ఎల్ఈడీ ట్యూబ్ లైట్ల తయారీ విధానాన్ని నేర్చుకున్నారు. ప్రస్తుత సమాజంలో వాతావరణ కాలుష్యం అధికంగా పెరిగి జనజీవనం అస్తవ్యస్థమైందన్నారు. పర్యావరణ సమతుల్యతకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు బాధ్యత తీసుకోవాలన్నారు. శిక్షణ పొందిట్యూబ్ లైట్లను తయారీ చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ అధికారి విద్యాసాగర్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, ఎన్‌జీసీ కో-ఆర్డినేటర్ అంజన్‌కుమార్, ఆగయ్య పాల్గొన్నారు.

ధూళికట్ట లో వైద్యశిబిరం

ఎలిగేడు, ఆగస్టు13: ధూళికట్ట లో ప్రభుత్వ దవాఖాన వైద్య బృందం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 57 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి లాబ్‌కు పంపించినట్లు తెలిపారు.. సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ఉండేందుకు ఇంటి చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వివరించారు. ఇక్కడ డాక్టర్ క్రిస్టినా, వైద్య సిబ్బంది వినయ, విజేందర్, నాగమణి, అమృత, శిరీష, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

అనాథ పిల్లలకు సాయం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు13: ఆశన్నపల్లె లో తల్లిదండ్రులను కోల్పోయిన మంద అభిలాష్, మనీషాలను ఊషన్నపల్లె లక్కమారి కాపు సంఘం నాయకులు మంగళవారం పరామర్శించి రూ.5వేలు సాయం అందించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొనుకటి మల్లారెడ్డి , సంఘం నాయకులు ముస్కు కొండయ్య, మల్లారెడ్డి, రాములు, మంద రాజిరెడ్డి, వెంకన్న, కదురు మల్లారెడ్డి లు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు మృతి

ధర్మారం,ఆగస్టు13 : రామయ్యపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు కాల్వ నర్సింగం (40) మంగళవారం గుండెపోటుతో మరణించాడు. స్థానికులు తెలిపిన ప్రకారం..నర్సింగం రాష్ట్ర సాధన ఉద్యమంలో పార్టీలో చురుగ్గా పని చేశాడు. నర్సింగం రోజు మాదిరిగానే వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఛాతిలో నొప్పి వస్తుందని గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి బైక్‌పై ధర్మారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లాడు. అనంతరం దవాఖాన నుంచి బయటకు వచ్చిన కొద్ది సేపటికే ఛాతిలో నొప్పిగా తీవ్రంగా ఉందంటూ నర్సింగం డాక్టర్‌కు చెప్పడంతో అతనిని కరీంనగర్‌కు హుటాహుటిన అంబులెన్స్‌లో తరలించగా మార్గం మధ్యలోని అతని పరిస్థితి విషమించి గుండెపోటుతో మరణించాడని గ్రామస్తులు తెలిపారు. మృత దేహాన్ని రాత్రి స్వగ్రామానికి తీసుకురాగా కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య స్వప్న, కూతురు హాసిని (16), కుమారుడు అభిలాష్ (14)ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్,ఆగస్టు13: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 17 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు, 148 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం కాల్వశ్రీరాంపూర్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను దశలవారీగా అమలు చేస్తామని చెప్పారు. అంతకు ముందు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని హైస్కూల్ లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యాగౌడ్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్దన్, గిర్దావర్లు రాజేందర్, అజీమ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ధర్మారం,ఆగస్టు13: మండలంలోని 275 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాలులో ఏఎంసీ చైర్మన్ లావుడ్యా రూప్లా నాయక్, తహసీల్దార్ రజిత,ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి బాధితులకు మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్,కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య,డైరెక్టర్లు గంధం మహిపాల్,కాంపెల్లి రాజేశం,అలువాల రాజేశం, బద్దం గంగారెడ్డి,వడ్లకొండ సుమతి,నాయకులు కొత్త నర్సింహం, వడ్లకొండ అంజయ్య, గంధం మహేందర్ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13: ఆర్జీ-2 ఎంవీటీసీలో శిక్షణ పొందుతున్న ఉద్యోగులకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవయవదానంపై అవగాహన కల్పించారు. అనంతరం అవయవ దానానికి ముందుకు వచ్చిన 30మంది యువ ఉద్యోగులకు ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్లాంటు ఇన్‌చార్జి ఎన్. రమేశ్, ఏటీవో మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రాజమహేందర్ రెడ్డి, నాగెల్లి సాంబయ్య, మహేశ్, తిరుపతి పాల్గొన్నారు.

సుల్తానాబాద్ రూరల్, ఆగస్టు 13: సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్ విద్యార్థులకు అవయవదాంపై అవగాహన కల్పించారు. జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా కో-ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, డైరెక్టర్ మాటేటి కృష్ణప్రియ, ఉపాధ్యాయులు, ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గోదావరిఖని, ఆగస్టు 13: బీఆర్ఎస్ నాయకురాలు రమ్యా యాదవ్ తల్లి శకుంతల మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఆమె మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి, ఓదార్చారు. ఇక్కడ నాయకులు నారదాసు మారుతి, చెలుకలపల్లి శ్రీనివాస్, నూనె శరత్, బచ్చల రాములు, ఆవునూరి వెంకటేశ్, పర్లపెల్లి బాపు, కనకయ్య, సురేష్, మౌనిక, తదితరులు ఉన్నారు.

ఓదెల, ఆగస్టు13: ఇందుర్తి గ్రామానికి చెందిన కంకణాల రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష మంగళవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, బొంగోని వెంకటేశ్, కంకణాల మధుసూదన్, గోవిందుల ఎల్లస్వామి, గట్టు మహేశ్, బండ నిఖిల్, కుమార్, కళ్యాణ్, అశోక్, సతీశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేత

సుల్తానాబాద్ రూరల్, ఆగస్టు 13: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్‌కు చెందిన పద్మశాలీ సంఘం సభ్యుడు, మాజీ ఉప సర్పంచ్ పెగడ గౌరయ్య సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం పద్మశాలి సంఘం శాస్త్రీనగర్ ఆధ్వర్యంలో అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ. 2వేలు జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరి మహేందర్, నాయకులు తుమ్మ రాములు, మేరుగు వెంకటేశ్, వేముల మల్లేశం, వెంగళ భిక్షపతి, మహేశ్ల రాజేశం, కట్కూరి రాజు, వెనగంటి వెంకటేశ్‌లతో పాటు పద్మశాలు సంఘం సభ్యులు, అందజేశారు.

జీఎంకు సన్మానం

గోదావరిఖని, ఆగస్టు 13: ఆర్జీ-1 జీఎంగా పనిచేసిన చింతల శ్రీనివాస్ జీఎం సేఫ్టీగా ప్రమోషన్‌పై కార్పొరేట్‌కు బదిలీ కాగా, మంగళవారం పర్సనల్ డిపార్ట్‌మెంట్, సీఎంవవోఐ,జీఎం కార్యాలయ అధికారులు సత్కరించారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీనియర్ పర్సనల్ అధికారులు బంగారు సారంగపాణి, శ్రావణ్ కుమార్, సీఎంవోఐ ప్రెసిడెంట్ మల్లేశ్, వైస్ ప్రెసిడెంట్ పోనుగెటి శ్రీనివాస్, చిలుక శ్రీనివాస్, డాక్టర్ కిరణ్ రాజు, పెరుమాళ్ల శ్రీనివాస్, కోల మల్లేశ్, అంజయ్య, దామోదర్, క్రాంతికుమార్, పీవోఏ దేవాచారి ఉన్నారు.

సీఎండీని కలిసిన ఆర్జీ-3 కాంట్రాక్టర్లు

రామగిరి, ఆగస్టు 13: సింగరేణి ఆర్జీ-3 ఏరియా కాంట్రాక్టర్లు మంగళవారం హైదరాబాద్‌లో సీఎండీ బలరాంను కలిశారు. కాంట్రాక్ట్ కార్మికుడు డ్యూటీకి రాకపోతే ఆ పెనాల్టీని కాంట్రాక్టర్ బిల్లు నుంచి రికవరీ చేసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు రామచంద్రరావు, కృష్ణ, ఎరుకల ఓదెలు, సమ్మయ్య, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్జీ-2ను సందర్శించిన డైరెక్టర్

యైటింక్లయిన్ కాలనీ, ఆగస్టు 13: ఆర్జీ-2 ఏరియాను డైరెక్టర్ ఆపరేషన్ ఎన్‌వీకే శ్రీనివాస్ మంగళవారం జీఎం సూర్యనారాయణతో కలిసి సందర్శించారు. ముందుగా ఓసీపీ-3 గనిలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఉత్పత్తి, రవాణాపై సమీక్షించారు. జీడీకే-7 ఎల్ఈపీ గని సందర్శించి స్టాండ్ స్టోవింగ్‌కు సంబంధించి బంకర్, మెటీరియల్‌ను పరిశీలించారు. వారి వెంట పీవో మధుసూదన్, ఎస్ఓటు జీఎం వెంకటేశ్వరావు, సర్వే అధికారి నర్సింగరావు, మహేంద్, ఎస్ఓ షరీఫ్ మహ్మద్ తదితరులున్నారు.

సింగరేణి దవాఖాన తనిఖీ

గోదావరిఖని, ఆగస్టు 13: ఆర్జీ-1 జీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జీఎం డీ లలిత్‌కుమార్ మంగళవారం గోదావరిఖని సింగరేణి ఏరియా దవాఖానను తనిఖీ చేశారు. వార్డులో సందర్శించిన జీఎం సిటీ స్కాన్, బ్లడ్ బ్యాంకు, ల్యాబ్, కార్డియాక్ ల్యాబ్‌ను పరీక్షించారు. కార్డియాక్ ల్యాబ్ పనులల పురోగతిని తెలుసుకున్నారు. జీఎం వెంట ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, డివైసీఎంఒ కిరణ్ రాజ్‌కుమార్, దవాఖాన సిబ్బంది ఉన్నారు.